

# గ్రహాంతర యాత్ర

## కొడవటిగంటి కుటుంబరావు

ఈ సంగతికాస్త పత్రికలన్నిటిలోనూ వేయించండి. వీలుంటే చరిత్రలోకూడా చేర్పించండి. నేను మొన్న సోంవారం రాత్రి గ్రహాలన్నిటినీ చూసి వచ్చాను. కొంపతీసి నన్ను మొట్టమొదటి గ్రహాంతర యాత్రికుణ్ణని మటుకు అనకండి. నాలాగా గ్రహాంతరాలకు వెళ్ళినవారు చాలామంది ఉన్నారు. ఏటా అరడజను మందికి తక్కువ లేకుండా వెళుతూనే ఉన్నారు. వారు ఏమైనారో తెలియక మిగిలినవాళ్లు సతమతమై పోయారు, అంతే. అనేక శతాబ్దులుగా, సహస్రాబ్దులుగా గ్రహాంతర యాత్రలు సాగుతూనే ఉన్నాయి. వెనకటికి ఆ శాస్త్రుల్లుగారిని జర్మనీవాళ్లు పట్టుకుపోయినట్టుగా, మంగళగ్రహంవాళ్ళొచ్చి అడపా దడపా భూలోకవాసులను పట్టుకు పోతూనే ఉన్నారు. ఈనాడు కూడా పత్రికల్లో "కనిపించుట లేదు" అని ప్రకటనలు చదువుతామే, వాళ్ళలో ఎంతమంది ఈ క్షణాన ఇతర గ్రహాలలో ఉన్నారో చెప్పలేం.

ఇతర లోకాలు చూసి మళ్ళీ కొద్ది గంటల్లో తిరిగివచ్చిన మొదటివాణ్ణికూడా నేను కాను. చాలామంది ఏ చంద్రుడిలోనో, శుక్రుడిలోనో, శనిలోనో స్థిర పడిపోయి నప్పటికీ కొందరు మళ్ళీ భూమికి బయలు దేరారు. వారిలో కొద్ది మందికి దారిలో ప్రమాదాలు జరిగి ఉండవచ్చు. కొందరికి మతిమరుపు కలిగించి మరీ పంపారు అవతలి లోకాలవాళ్లు; ఆ దెబ్బతో వాళ్ళు తాము చూసిందంతా మరిచిపోయి శాశ్వతంగా పిచ్చివాళ్ళయి పోవటమో, లేక స్మరణ తిరిగివచ్చాక తమ లోకాంతరానుభవాలు జ్ఞాపకం లేకపోవటమో జరిగింది. నాలాగా అన్ని

గండాలూ గడిచి బయటపడినవాళ్లు ఏ నూరేళ్ళకో ఒకడుంటే వాడిమాట ఎవరు నమ్ముతారు ?

ఇప్పుడు నా మాటలు ఎంతమంది నమ్ముతారో నాకు తెలీదా ? చంద్రుడి దగ్గిరికి అట్లా వెళ్ళిరావటానికే ఒక వారం పడుతుందనీ, మంగళగ్రహానికి వెళ్ళటానికే మూడునెలలు పడుతుందనీ శాస్త్రజ్ఞులు ఒకవంక ఘోషపెడుతుంటే, నేను ఒక్కరాత్రిలో—మొన్న సోంవారం రాత్రి ఎనిమిదింబావుకూ తెల్లవారు జామున నాలుగున్నరకూ మధ్య — దాదాపు అన్నిగ్రహాలూ చూసొచ్చానంటే ఎవరు నమ్ముతారు ? ఇప్పటికి వంద మందికి చెప్పాను. కొందరు నన్ను చూసి నవ్వారు, కొందరు జాలిపడ్డారు. (ఒక ౠష్టుడు, "నీ ఆరోగ్యం బాగా లేదని నేను అనుకుంటూనే ఉన్నాను. పట్నంలో ధైర్యం ఆస్పత్రికి, ఎందుకైనా మంచిది, వెళ్ళి రాగూడదూ ?" అన్నాడు కూడానూ.) నోటి మాటలు నమ్మలేనివాళ్ళు అచ్చులోచూసి నమ్ముతారు. అందుకే నా అనుభవా లన్నీ రాసేస్తున్నాను. అప్పటికీ నమ్మరూ ? నాకు కలిగే నష్టంలేదు, చరిత్రకే నష్టం, శాస్త్రానికి నష్టం.

## 2

జరిగిం దేమిటంటే, సోంవారం సాయంకాలం ఉప్పెనవరా న్నుంచి బయలుదేరి మావూరొస్తున్నాను. ఉప్పెనవరం మా వూరికి ఏడుమైళ్ళు. మా మూడో చెల్లెల్ని ఆ వూరిచ్చాం. వాళ్ళకు మంచి జామతోటకూడా ఉందిలెండి. తెల్లారేసరికి ఇంట్లో ఉండాలి. సూరయ్య తూర్పు తెల్లవారుతూనే వచ్చి కూచుంటాడు. ఆ పొగాకు సంగతి ఏమిటో అంతు తేలాలి మరి. అంచేత చీకటి పడిందనికూడా చూడక, మా చెల్లెలితో వస్తానని చెప్పి బయల్దేరాం. "పాములుంటై, జాగర్త !" అని మా చెల్లెలు కేకేసి మరీ చెప్పింది.

అయిందాండీ ! మా వూరుకు అంత దూరంలోకి వచ్చేసరికి ఎవరో నాముందు నల్లగా ప్రత్యక్షమై, "ఒక్కసారి ఇలా వస్తారా ?" అని మహా మర్యాదగా అడిగాడు. ఆ చీకట్లో ఒకచిన్న కుప్పలాగా ఏదో కనిపించింది. వాడు అందులోకి నన్ను తీసుకుపోయి తలుపులాటిది మూసేసరికి ఏదో దీపం వెలిగింది. అదేదో గదిలాగా ఉంది.

"ఏమిటిది ?" అన్నాను. ఆ మనిషి తెలుగు అంత బాగా మాట్లాడినా కొంచెం కూడా తెలుగువాడల్లే లేడు. కావటానికి మనిషేగాని భూమి మీద అటువంటి మనుషు లుండరు.

" ఇది సరికొత్తరకం ఫ్లయింగ్ సాసర్" అన్నాడు వాడు.

"అహోరించినట్టే ఉంది ! నాకు ఈ సాసర్లు చూస్తూ కూచోటానికి అవతల

బోలెడంత పని ఉంది. ఆ సూరయ్య తెల్లారకముందే వర్జ్యంలాగా వచ్చి కూచుంటాడు. రేపటితో నేనుపొగాకులో మునగటమో, తేలటమో తేలిపోవాలి."

"సరే, పోదాం పదండి" అంటూ వాడు తలుపు తెరిచాడు. లోపల గదిలో లైటు ఆరిపోయిందిగాని బయట దివ్యమైన వెలుతురు. కొంచెం తల ఎత్తి చూస్తే ఆకాశాన పెద్ద గుమ్మడికాయంత చందమామ ప్రకాశిస్తున్నది! ఆ చోటు నేనెరిగిందికాదు. ఎటుచూసినా కొండలు. ఎక్కడా చెట్టూ, చేమా లేదు.

"ఇదేమిటి? ఏమిటిది?" అన్నాను, ఆశ్చర్యాన్నీ, భయాన్నీ, చిరాకునూ కలిపి రుబ్బేస్తూ.

"ఇది చంద్రలోకం" అన్నాడు వాడు.

"మరి భూలోకం ఏమైనట్టూ?"

ఆ కడవంత చంద్రుడికేసి చూపించాడు వాడు.

"ఇంతలోనే అక్కణ్ణుంచి ఇక్కడికి వచ్చామా? అసంభవం. ఆ రష్యావాళ్ళువేసిన రాకెట్టు —"

"మనం దాదాపు వెలుతురు వేగంతో వచ్చాం. అంతా మూడున్నర సెకండ్లు పట్టింది. మనం ఇక్కడ చేరి దాదాపు పదిసెకండ్లు కావస్తున్నది. చెప్పాను గదా, ఇది సరికొత్తరకం సాసరు."

"చంద్రుడిలో గాలీ, నిప్పూ, నీరూ, ఏవీ లేవన్నారుగా. మనం ఊపిరాడక చావటం లేదేం?" అన్నాను.



"గాలి లేకపోవటమేమిటి? భూమి మీద ఉండే తేలికైన గాలి లేదుగాని బరువైన గాలి ఉన్నది. ఇది భూమి మీది గాలికి పదహారింతలు బరువు. నేలపైనుంచి దాదాపు ఒక మైలుఎత్తు దాకా గాలి ఉన్నది," అన్నాడు వాడు.

### 3

నేనిక్కడ గ్రహాలను గురించిన వైజ్ఞానిక విషయాలుచెప్పి మీ ప్రాణాలు తీయటం లేదు. ఎవరన్నా శాస్త్రవేత్త వచ్చి ఇంటర్వ్యూ చేస్తే అతగాడితో నా కర్థమైన విషయాలన్నీ చెప్పెయ్యటానికి సిద్ధంగా ఉన్నాను.

ఇప్పుడు నేను ముఖ్యంగా చెప్ప దలుచుకున్న విషయాలేమంటే —

అన్ని లోకాలలోనూ మనుషులున్నారు. ముందే చెప్పానుగా, భూమి మీది మనుషుల్లాంటివాళ్లు కారు. అయితే భూమిమీద ఎన్నిరకాల మనుషు ల్లేరు? ఒక తెల్లవాణ్ణీ, నీగ్రోనూ, జపానువాణ్ణీ, ఆఫ్రికాలో ఉండే మరుగుజ్జునూ ఒక చోటపెట్టి చూడండి, ఎంత వ్యత్యాసం కనిపిస్తుందో. భూమిపైన ఉండే జాతుల్లోనే నెత్తిన జుట్టుండి, గడ్డాలూ, మీసాలూ మొలవనివాళ్లున్నారు గద.

అలాగే చంద్రుడిలోనూ, కుజుడిలోనూ, శుక్రుడిలోనూ, బుధ, గురు, శని గ్రహాలలోనూ నిక్షేపంగా మనుషులున్నారు. అంతేకాదు, ప్రతి గ్రహంలోనూ మన భాషలు తెలిసినవాళ్లుకూడా ఉన్నారు. మన రేడియోలు విని వాళ్లు మన భాషలు నేర్చుకుంటారుట. రాయటమూ, చదవటమూ మాత్రం వాళ్ళతరం కాదు. వాళ్ళకు నిజంగా శ్రద్ధ ఉంటే నాబోటి యాత్రికుడి ద్వారా అదికూడా నేర్చుకోవచ్చు. కాని వాళ్ళకు శ్రద్ధలేదు. వాళ్ళ భాషలకే లిపీ, రాతా లేవు. వాళ్ళ పుస్తకాలన్నీ రికార్డులే. వార్తలుకూడా రేడియో ప్రసారాలద్వారా తెలుస్తాయి.

నన్ను గ్రహాలన్నీ తిప్పినవాడు మంగళ్ళ (కుజ) గ్రహం వాడు. వాళ్ళ శాస్త్రవిజ్ఞానం వర్ణనాతీతం. అందుకే మంగళగ్రహాన్ని చూసి మిగిలిన గ్రహాలు వణికిపోతాయి; మాటవరసకు అనటం కాదు — నిజంగా వణికిపోతాయి. వాళ్ళు మిగిలిన గ్రహాలమీద భూకంపాలూ, అగ్నిపర్వతాల విజృంభణలూ పుట్టించగలరు. వాళ్ళ దిక్కుమాలిన ప్రసారాలతో జనంలో యుద్ధోన్మాదాలూ, జాత్యహంకారాలూకూడా రెచ్చగొట్టగలరని నా నమ్మకం.

భూమిపైన ఉండే మనకు తెలియనట్టుగానే ఈ మంగళగ్రహం వాళ్ళను గురించి ఇతర గ్రహాలమీది వాళ్ళకూ తెలియదు. కాని భూమినిగురించిమటుకు అన్ని గ్రహాలలోనూ తెలుసు. ఇతర గ్రహాలనుంచి భూమికి వలసవచ్చినవాళ్లు లేరుగాని, భూమినుంచి వలసవచ్చినవాళ్ళు అన్ని గ్రహాలలోనూ ఉన్నారు.

చంద్రుడిపైన ఒక మనిషితో ఒక అరగంటగడిపి అక్కడి కమామీషంతా తెలుసుకున్నాను. నన్ను తెచ్చినవాడు వెంటనే ఉన్నాడు.


## 4

చంద్రలోకాన్ని మనవంటి సంస్కారంగల వాళ్ళం సహించలేం. అక్కడ ఎక్కువమంది పేదలు. పేదవాళ్ళు తక్కువకులం. బొత్తిగా ఆస్తిలేని వాళ్ళది హీనకులం. కులాలు కేవలం ఆస్తిపైనే ఆధారపడతాయి గనక, ఒకే మనిషి కులాలు మారుతూ ఉంటాడు.

పై కులాలవాళ్ళకే పనిలేని ఉద్యోగాలుంటాయి. ఉద్యోగులకు జీతాలుండవు. ఆ మాటకువస్తే పనిచేసేవాళ్ళకూ జీతాలుండవు. తక్కువ కులాలవాళ్ళకు పని ఎక్కువ. ఎంత ఎక్కువపనిచేస్తే అంత తక్కువ హక్కు లుంటాయి. మరీ హీనకులస్తులు పనిచేసేకాలంలోవిశ్రాంతి తీసుకునేకాలం పదోవంతు మాత్రమే ఉంటుంది. వాళ్ళకు తిండిమాత్రమే పెడతారు. వాళ్ళ బట్టలు వాళ్ళే నేసుకోవాలి — అదికూడా విశ్రాంతి కాలంలో.

ఏ కారణంచేతగాని ఆస్తి పోగొట్టుకుని కులభ్రష్టుడైనవాడికి ఉద్యోగం — అంటే అధికార హక్కులు — పోవటమూ, భార్యలు విడాకు లివ్వటమూ మొదలైనవి జరుగుతాయి. ఆడవాళ్ళు వేరే ఒకకులం. వాళ్ళకు ఆస్తులుండవు.

“నిజానికి ఆడవారిలోనూ కులాలు వున్నాయి. కాని ఆ సంగతిని పైకి



ఒప్పుకోం. చిన్న వయసులో ఉన్న అందగత్తెలు ఉత్తమకులం. ఎందుచేత నంటే వాళ్ళు ఉత్తమకులస్థులకు భార్యలై వారి అధికార హక్కులన్నిటినీ వినియోగించుకుంటారు. అనాకారులకు హీన కులస్థులు మాత్రమే దొరుకుతారు గనక వాళ్ళు ఎక్కువపని చెయ్యాలి" అన్నాడు చంద్రలోకవాసి.

"మీ సాహిత్యంమాటేమిటి?" అని అడిగాను.

"మాకు మంచి సాహిత్యం ఉన్నది. అంతా ఉత్తమ కులాలవాళ్ళు మాత్రమే సాహిత్యం రాయవచ్చు. కింది కులాల వాళ్ళు సాహిత్యం రాస్తే కఠినశిక్ష పొందుతారు....మా సాహిత్యం అంతా స్త్రీలనుగురించే. ఒక అందగత్తె అయిన స్త్రీ ఒక హీనకులంవాణ్ణి ప్రేమించి తన జీవితమంతా పనిలోగడిపి, తనఅందాన్ని పోగొట్టుకుని, ప్రేమనుకూడా పోగొట్టుకుని చచ్చిపోతుంది. ఆమనిషి కావలిస్తే అత్యున్నతకులంలో ఉండి చంద్రభోగాలన్నీ అనుభవించగలది. కాని ప్రేమ కోసం ప్రేమనుసయితం త్యాగంచేసింది. ఈ కథను సుమారు తొమ్మిది లక్షల మంది రకరకాలుగా రాశారు."

"అలాటి స్త్రీలు చాలామంది ఉన్నారు కాబోలు" అన్నాను.

"నాకు తెలిసినంతవరకు ఒక్కతె కూడా లేదు. అయినా జరిగేదే కథలుగా రాయటంలో అర్థమేముందీ? ఎక్కడా జరగని విషయాలైతేనే సాహిత్యంగా రాయాలి" అన్నాడు చంద్రవాసి.

"అదేం సిద్ధాంతం?" అన్నాను నిర్ఘాంతపోయి.


"మీ లోకంలో బూర్జువాలు చెప్పేది అదే సిద్ధాంతం. ఎందుకు ఆశ్చర్యపడతావు?" అన్నాడు మంగళగ్రహం వాడు.

తరవాత మాకు చంద్రలోక సాంఘిక వ్యవస్థగురించి చర్చ జరిగింది. చంద్రలోకంకంటె భూలోకమే మెరుగన్నాను. అక్కడ కులాలున్నా శాశ్వతంగా ఉండటంచేత జీవితం ఒడుదుడుకులు లేకుండా నడుస్తుంది.

"మీ భారతదేశంమాట చెప్పకు. మిగతా భూమిమీద కూడా కులాలూ, హక్కులూ కూడా డబ్బునుబట్టే ఏర్పడుతున్నాయి. కులాలున్నచోట సైతం హక్కులు డబ్బునుబట్టే వస్తున్నాయి. పాలుతాగే పిల్లిలాగా కళ్ళుమూసుకుని మీరు అలాటిదేమీ లేదనుకుంటున్నారు. మా సమాజం వాస్తవిక దృష్టితో ఏర్పాటు చేసినది" అన్నాడు చంద్రవాసి.

"అవునవును! ఆ పిడికెడు మెతుకులకోసం ఆశపడి మీ తక్కువకులాల వాళ్ళు పనిచెయ్యబట్టే మీ బతుకులు వెళ్ళ మారుతున్నాయి." అన్నాడు మంగళగ్రహం వాడు.

"నువు విప్లవం రెచ్చగొట్టుతున్నావా?" అన్నాడు చంద్రవాసి.



ఇంకా ఎందుకోయ్ ముక్కుతావు, సామాను నా నెత్తిమీదే పెట్టుకుంటినిగా.

"విప్లవం దానంతట అదే రేగుతుంది. ఒకరు రెచ్చగొట్టితే రేగిన విప్లవం ఎన్నాళ్ళు సాగుతుంది?" అన్నాడు మంగళ గ్రహం వాడు.

వాడి ధోరణి చూస్తే కమ్యూనిస్టు ధోరణిగానే ఉన్నది. కాని నాకు చంద్రలోకం కూడా నచ్చలేదు. "బాబూ, నన్ను ఇంటికి చేర్చుతావా?" అని నన్ను తెచ్చినవాడితో అన్నాను.

5

కాని వాడు నామాట లక్ష్యపెట్టక, "అపరాత్రివేళ ఇంటికిపోయి ఏం చేస్తావు?" అన్నాడు.

"ఆ సూరయ్యసంగతి నీకు తెలీదు. అసలు ముహూర్తం మొన్న శనివారం తెల్లవారుజామున పెట్టాడు. నేను చెప్పుల్లో కాళ్ళు పెట్టేసరికి తూర్పున తెల్లగా కనిపించిందిట, దుర్ముహూర్తమని ఇంటికి చక్కాపోయాడు. మరి సూరయ్య లేకుండా ఆ పోగాకు —"

నన్ను సాసర్లోకి తోసి తలుపు మూశాడు. దీపం వెలిగి ఆరినంతసేపు పట్టలేదు — మేం ఇంకో లోకంలో ఉన్నాం. ఆ సాసరును ఎవడు నడుపుతున్నాడో నాకు చచ్చినా అర్థంకాలేదు. ఎంతసరికొత్త సాసరైనా ఏవోమీటలూ, మరలూ ఉండాలిగా. మేం ఉన్నగది బొత్తిగా బోడిగోడలు తప్ప ఇంకేమీ లేవు. కాళ్ళతో ఏమన్నా చేస్తున్నాడా అనికూడా అనుకున్నాను. కాని నేల కూడా బోడే....

"ఇదేమిటి ?" అన్నాను.

"శుక్రుడు" అన్నాడు వాడు.

అక్కడా మనుషులున్నారు—చక్కని తెలుగు మాట్లాడేవాళ్ళు.

"లోకాంతర వార్తాహరుడా!" అంటూ నన్నొక పొట్టిమనిషి పలకరించాడు. అతనే అక్కడి పరిస్థితులు నాకుచెప్పింది.

శుక్రగ్రహంలో జాతి మత కుల భేదాలు లేవు. కాని అంతకంటె దారుణమైనది — డబ్బు — అక్కడ వీరవిహారం చేస్తున్నది. ప్రతి ఊరికీ ఒక ధనలక్ష్మి ఆలయం ఉన్నదట! అక్కడ కూడా డబ్బు ఆడదే.

వీళ్ల డబ్బుపిచ్చి ఎంతదాకా పోయిందంటే, ఒకరి నొకరు మర్యాద చేసుకోవటానికి ఉత్తుత్త డబ్బు ఇచ్చుకుంటారు. ఆ పొట్టివాడు నాకు ఒకకోటి ఇచ్చాడు! కాని అది నిజమైన డబ్బు కాదు. ఈ ఉత్తుత్త డబ్బును పిల్లలకిస్తే వాళ్లు ఏడుపు మానేస్తారుట.

అసలు డబ్బు ఎట్లా ఉంటుందో చూసిన వాళ్లు బహుకొద్ది. డబ్బు కోసం హత్యలు తరుచు జరుగుతాయి. ఆడవాళ్ల కోసం కూడా హత్యలు జరుగుతాయి. డబ్బుకోసం చేసే హత్యలకు శిక్షలు స్వల్పం. డబ్బుకోసం హత్యలు చెయ్యటం అక్కడ ఆనవాయితీగా వస్తున్నదట. ఒక ప్రాణం తీసి ఎంత ఎక్కువ డబ్బు సంపాదిస్తే అంత ఘను డన్నమాట. కొద్ది డబ్బుకోసం హత్యలు చేసే వాళ్లను కఠినంగా శిక్షిస్తారు. తిండి కోసమో, బట్ట కోసమో హత్యలు చేసే వాళ్లు కఠిన శిక్షలు పొందుతారు.

కొద్ది రోజుల క్రితమే ఒకడు ఒక్క హత్యతో నూరుకోట్లు సంపాదించాట్ట. వాడి విచారణ చూసి తీరవలిసిందని చెప్పారు. వాణ్ణి ధనలక్ష్మి పెంపుడు కొడుక్కు జరిగినంత గౌరవ మర్యాదలతో జనం చూశారుట.

ఈ లోకంలో ప్రధాన పరిశ్రమ ఇనప్పెట్టెల్లాటివి. అనేక వేలమంది శాస్త్రజ్ఞులు ఈ పరిశ్రమలో పనిచేస్తారుట. ఇనుమును ఇక్కడ తగరంకన్న హీనంగా చూస్తారు. ఇనుముకన్న ఇరవై రెట్లు గట్టి పదార్థంతో చేసిన ధనపు పెట్టెలు సామాన్యుల ఇళ్లలో కూడా ఉంటాయి. రెండో పరిశ్రమ రక్షణాయుధాలు. ఇవే మారణాయుధాలు కూడానూ. డబ్బును రక్షించుకునే ప్రయత్నంలో హత్యలు చేసిన వాడిమీద కేసుకూడా ఉండదు. స్త్రీల కోసం ధనికులు చేసే హత్యలు ధన రక్షణకుగాను చేసిన హత్యల్లాగా ఉండేట్టు సాక్ష్యం సృష్టిస్తారు.

ఇక్కడ సెక్స్ ప్రధానం. ఇక్కడి ప్రసిద్ధ శాస్త్రవేత్తలు తిండికన్న సెక్సు ప్రధానమనీ, డబ్బు సెక్స్ చిహ్నమనీ ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు. జనం పవిత్రంగా భావించే దంతా సెక్స్ జన్యమే



"సందేహించకండి స్వామీ ! నా చేతిలో ఉన్నదేదో సరిగా చెప్పండి"
"అబ్బే మరేంలేదు — నా ఫీజుగూడా కనబడటం లేదే అని విచారిస్తున్నా"

నని నిరూపిస్తూ, ఒక గొప్ప శాస్త్రవేత్త 30 సంపుటాల ఉద్గ్రంధం రాశాడు. ఇక్కడి ప్రాచీన సాహిత్యంలో స్వర్గ వర్ణన లన్నీ ప్రత్యక్షంగానో పరోక్షంగానో సెక్స్‌ను స్ఫురింప జేస్తాయి. కవులు ఆడదాని ఆలింగనంలో ప్రాణాలు వదలాలని కోరుతూ రాసిన పద్యాలు చిన్న పిల్లలచేత కూడా చదివిస్తారు. అదంతా వింటుంటే నాకు చచ్చే జుగుప్స కలిగింది.

## 6

తరవాత గురు గ్రహానికి వెళ్లాం. దీన్ని వర్ణించటం నావల్ల కాదు. రాత్రి అయేది పగలయేది ఆకాశం కనిపించదు. ఎప్పుడూ మేఘాలు కాంతి వెదజల్లుతుంటాయి. అక్కడి ఇళ్లు అన్నీ అనేక వందల అడుగుల ఎత్తుంటాయి. విద్యుచ్ఛక్తి కన్న చాలా హెచ్చయిన శక్తులను వాళ్లు వినియోగిస్తున్నట్టు కనిపిస్తారు. దయ్యపు బల్లుల్లాటి జంతువులు అక్కడ కొల్లలు కొల్లలుగా కనిపిస్తాయి. మనుషులు కూడా చాలా భారీగా, రాక్షసులల్లే ఉంటారు.

ఇక్కడి సాంఘిక పరిస్థితి నాకు ఏమీ అంతు బట్టలేదు. కాని ఇక్కడ రాజకీయాలు చాలా హెచ్చుగా కనిపించాయి. ఎక్కడికి వెళ్లినా రాజకీయ నినాదాలూ, రాజకీయ ప్రచారమూనూ.

తెలుగు మాట్లాడే రాజకీయ వేత్త నాతో పది నిమిషాలు మాట్లాడాడు. ప్రపంచంలో — అంటే గురు గ్రహం మీద — ఒకటే నిజం ఉన్నదిట ; ప్రజలు నమ్మినది, నమ్మేటట్టు చేయగలిగినది.

రాజకీయాధికారం కోసం అసత్యారోపణలూ, అబద్ధపు ప్రచారాలూ చెయ్యటం మనిషి ధర్మంట. ఇక్కడ అత్యుత్తమ స్థానం రాజకీయాధిపతిది. దీనికి ఒక రకం ఎన్నికలుంటాయి. అధిపతిగా ఎన్నుకోబడ్డవాడు చలాయించలేని అధికారంలేదు. ఎన్నికల పోటీ దారుణంగా ఉంటుందిట. ఆపదవికి పోటీ చేసే వాళ్లలో నూటికి అరవైమంది హత్యలకు గురి అవుతారుట.

"మనిషికి కావలిసింది శక్తి, అధికారం! మిగిలినవన్నీ దాని తరవాతనే. అధికారం కోసం చచ్చిన వాడు స్వర్గానికి అధిపతి అవుతాడు" అన్నాడా రాజకీయవేత్త.

అక్కడపిల్లల్ని సాధారణంగాఆశీర్వదించేది "అధిపతి వవుతావు గాక!"అని.

"ఆడవాళ్ల మాటేమిటి?" అన్నాను.

"ఆడవాళ్లు పని చేస్తారూ!" అన్నాడు రాజకీయ వేత్త.

ఇది అక్షరాలా నిజమని తరవాత రుజువయింది. విజ్ఞానమంతా ఆడవాళ్లది. శాస్త్రవేత్తలుమొదలు రోడ్లుఊడ్చేవరకూ అంతా ఆడవాళ్లే. వాళ్లు పిల్లలనుకనరుట. పిల్లలు ప్రయోగశాలల్లో పుడతారు. ఈ ప్రయోగశాలలు జనాభాశాఖ కింద పని చేస్తాయి. గురు గ్రహం మీది జనాభా ఇరవై లక్షలకోట్లు — హెచ్చదు, తగ్గదు.

"ఆడవాళ్లంతా కలిసి తిరగబడితే మగవాళ్లగతి ఏంకాను?" అన్నాను.

రాజకీయవేత్త నవ్వి, "వాళ్లకు అధికారవాంఛ లేదు. వాళ్ల మస్తిష్కాలు చాలా భిన్నంగా ఉంటాయి. వాళ్లకు జీవితపు అల్ప సుఖాలపై కాంక్ష జాస్తి. రకరకాల రుచులుగల ఆహార పానీయాలూ, తుచ్ఛమైన సంగీతమూ, రంగు దీపాలాటలూ వాళ్లకి ఇష్టం. వాళ్ల జీవితాలు సమగ్రమైనవి — వాళ్ల దృష్టిలో. వాళ్లు తిరుగుబాటు చెయ్యరు!" అన్నాడు, వాళ్ల జీవితం చూసి జాలిపడేవాడిలాగా.

## 7

శనిగ్రహానికి వెళ్లాం. నాకక్కడ ఒక్క క్షణం ఉండబుద్ధి కాలేదు. ఎక్కడా ఒకఅందమైనప్రదేశం ఉన్నట్టు లేదు. మనుషు లున్నారు కాని నోరువిప్పి మాట్లాడరు. అస్తమానం పని చేసుకు పోతుంటారు — అదికూడా చెమటోడ్చే శ్రమ. వారిలోవారుకూడా మాట్లాడుకోరు.

నా పాలిటికి ఒకడు దొరికాడు.

"ఇక్కడజీవితం ఎట్లా ఉంటుంది?" అన్నాను.

"మామూలుగానే ఉంది" అన్నాడు.

"అది కాదు. మీ లోకంలో నాయకులెవరు?"

"నాయకు లంటే?"

"మిగిలిన వాళ్లను నడిపించే వాళ్లు."

"మేం నడపగలం. ఒకరు నడిపించటం దేనికీ?"

"మీ కేమైనా సమస్యలుంటే ఏం చేస్తారు?"



ఏమండీ! రామయ్యగారంటే మీరేనా, మావారు తరచుగా
మిమ్మల్నే తలుస్తారు, ఎవరైనా డబ్బు ఎగవేస్తే.

"సమస్య లంటే ?"

"ఏంచెయ్యాలో తెలియకపోవటం."

"ఏం చెయ్యాలో అందరికీ తెలుసు."

"మీలో పోట్లాటలు వొస్తే ఎవరు తీరుస్తారు ?"

"పోట్లాట లంటే ?"

"ఒకరి నొకరు కొట్టుకోవటం, పొడుచుకోవటం, దోచుకోవటం, మోసం చెయ్యటం, చంపుకోవటం."

"ఎందుకూ ?"

"మీలో కళాకారు లున్నారా ?"

"కళ లంటే ?"

నన్ను తెచ్చిన వాడు అడ్డుపడి, "నువ్వడిగేవేవీ ఇక్కడ లేవు. వీళ్లకు శాస్త్రజ్ఞానం కూడా ఉన్నది. కాని దానితో శ్రమ తగ్గించుకునే ప్రయత్నం కూడా చెయ్యరు. వీళ్లకు పరమాణు శక్తి కూడా తెలుసు. కాని దానితో వీళ్లు ఆటవస్తువులు చేసుకుంటారు. వీళ్లకు పుస్తకాలులేవు. పనిచెయ్యకపోతే వీళ్లకు జబ్బు చేసినట్టవుతుంది. అన్నట్టు వీళ్లకు రోగాలు రావు. ఇక్కడ ఆస్పత్రులూ, వైద్యులూ లేరు. వీళ్లు తినే ఆహారం నిర్దుష్టమైనది. ఇంకో లక్ష ఏళ్లకు వచ్చి చూడు, వీళ్లు ఈవిధంగానే జీవిస్తూంటారు. ప్రతి ఒకడూ మూడు వందలేళ్లు బతుకుతాడు" అన్నాడు.

"పోదామా ?" అన్నాను.

"మా లోకం చూస్తావా ?" అన్నాడు.

"నే నింటికి పోవాలి" అన్నాను.

"దారేగా ?" అన్నాడు.

"సరే పద" అన్నాను.

మంగళగ్రహం మేం దిగినది ఒక ఎత్తయిన భవనంమీద. అక్కడకూడా రాత్రే ఆ సమయానికి. ఆకాశంనిండా రంగుదీపాలు వెలిగించినట్టుగా ఉన్నది. ఆ దీపాలు కదులుతున్నట్టు నేను మొదట గ్రహించలేదు.

"అవన్నీ మేం ఏర్పాటుచేసిన మండలాలు. అన్నిటికీ ప్రయోజనం ఉన్నది. చెబుతూ కూర్చుంటే చాలా వేళ అవుతుంది" అంటూ నన్ను భవనంలోపలికి తీసుకుపోయాడు. లోపల ఒక పెద్ద హాలున్నది. అది గుండ్రగా ఉన్నది. చుట్టూ సినిమా తెరలాటిది అమర్చి ఉన్నది. మేము దిగివచ్చిన మెట్లూ, ఏవో మీటలూ గదిమధ్య ఉన్నాయి.

అతను గదంతా చీకటిచేసి ఏదో మీటనొక్కేసరికి నా చుట్టూ అకస్మాత్తుగా ఆకాశమూ, నక్షత్రాలూ, గ్రహాలూ ప్రత్యక్ష్యమయాయి. ఒక్క క్షణంపాటు కంగారు పడ్డాను. సూర్యబింబం కేసి చూస్తే దానిచుట్టూ మంటలుకూడా కనిపిస్తున్నాయి. ఆ జ్వాలల కదలికను గమనించినాక నేను చూస్తున్నది బొమ్మ కాదనీ, కనీసం సినిమా అయి ఉంటుందనీ తోచింది. నా మనస్సు తెలుసుకున్న వాడల్లే అతను, "ఇది సినిమా కాదు. టెలివిజన్. నువు చూస్తున్నదంతా వాస్తవంగా ఆకాశమే. మీ భూమిమీద ఉన్న గొప్ప టెలిస్కోపులకంటె సుమారు రెండువందల రెట్లు స్పష్టంగా ఆకాశాన్ని ఈ గదినుంచి పరిశీలించవచ్చు. అచ్చగా సూర్యుణ్ణిగాని, ప్రత్యేక నక్షత్రాలనుగాని, దూరపు బ్రహ్మాండాలను గాని పరిశీలించటానికి వేరే గదులున్నాయి. మీది శాస్త్ర జ్ఞానంమీద నిర్మించిన జీవితం. దాదాపు ప్రతి ఒకరూ శాస్త్రజ్ఞానంకోసం కృషి చేస్తాం. దానికోసమే బతుకుతాం" అన్నాడు.

"మీ రాజకీయాలు —"

"మాకు రాజకీయాలు లేవు, సాంఘికంగా విభేదాలు లేవు."

"మీ ఆశయం ?"

"ముందుకు పోవటం. ప్రకృతిని వశపరుచుకోవటం."

"మీ వినోదం ?"

"సృష్టి, ప్రకృతి."

"శనిగాళ్ళ లాగా మీ జీవితంకూడా స్తంభించిపోతే ?"

"మా జీవితం స్తంభించే అవకాశం లేదు. మా లోకం సూర్యుడికి సరిఅయిన దూరంలో ఉన్నది. మీరు మరీ దగ్గిరిగా ఉండి నైసర్గికమైన మార్పులతో చాలా బాధపడుతున్నారు. శని గ్రహం మరీ దూరంగా ఉండి బొత్తిగా మార్పులు లేకుండా ఉంది. మాకు మార్పులున్నాయి గాని వాటిని ఏనాడో మా అదుపులోకి తెచ్చుకున్నాం. ఈనాడు ప్రకృతి మమ్మల్ని ఏమీ చెయ్యలేదు."

* * *

తెల్లవార్లూ మేలుకునిఉన్న కారణం చేతనో లేక ఆమనిషి ఏమైనా చేశాడో గాని నాకు మైకం ముంచుకు వచ్చింది. నాకు మళ్లా స్పృహ తెలిసే సరికి మా ఊరు అంతదూరంలో ఉన్నది. తూర్పున వేగుచుక్క — అన్నట్టు శుక్రుడు — ప్రకాశిస్తున్నది........ ★